

# కలకంఠి కథలు

## - శ్రీధర



ఈ కథల గురించి:

*1992లో ఈనాడులో వసుంధర పేజీ ప్రారంభించారు. స్త్రీలకు సంబంధించిన అంశాల కోసం. రామోజీరావు గారి సూచనలతో ఎడిటర్ వర్మగారు ప్రతి గురువారం ఒక వుమన్ ఓరియెంటెడ్ ఆర్టికల్ ఉండాలని నిర్ణయించారు. అప్పటికే శ్రీధర విష్ణుప్రియ కాలమ్ రాస్తున్నారు. అందుచేత స్త్రీలకు ఆసక్తికరంగా ఉండే ఒక ఆర్టికల్ రాయమని శ్రీధరని అడిగారు. మర్నాడు ఆర్టికల్ రాసిచ్చారు. దానిపేరు 'అమ్మకు ఎన్నడన్నా థాంక్స్ చెప్పారా?', బాగానే ఉందనిపించినా, రెస్పాన్స్ ఎలా ఉంటుందో నన్న చిన్న అనుమానం వర్మగారికి ఉండనే ఉంది. కానీ ఆ రాత్రి కంపోజింగ్ చేసినవాళ్లూ, పేజీ మేకప్ చేసినవాళ్ళు 'ఆగి, కళ్లు తుడుచుకున్నాం 'అని చెప్పినప్పుడు ఆయన అనుమానం నివృత్తి అయింది. అచ్చయ్యాక, చదివిన ప్రతివాళ్లూ, అవునూ, మా అమ్మ మా కోసం ఎంతో చేసింది, థాంక్స్ చెప్పాలన్న ఆలోచనే రాలేదు 'అని అన్నారు. తర్వాత వరసగా నాలుగు వారాలు ఇంకా ఎన్నాళ్లు నాకీ సంకెళ్ళు? 'దయచేసి అనాగరికుల అడ్రస్ చెప్పండి, 'ఇల్లాలి హృదయవేదనా నివేదన 'రాశారు. అనూహ్యమైన స్పందన వచ్చింది. 'నేను వ్యాసాలు రాయించాలనుకున్నాను, మీరు రాసిన వ్యాసాలు కథల్లానే ఉంటున్నయి, ఇంక కథలే రాయండి...' అన్నారు వర్మగారు. స్త్రీలకు సంబంధించిన పేజీ కనుక 'మల్లిక' పేరుతో ప్రతి గురువారం ఒకటి కాదు, రెండు కాదు నాలుగు వందల ఆణిముత్యాల్లాంటి కథలు ఒక దశాబ్దం పాటు ఏకబిగిన రాశారు. చాలా మందికి ఎవరీ మల్లిక, అన్న ప్రశ్న ఎదురైంది. ఈనాడుకు ఫోన్ కాల్స్ చేసినవారిలో ఎంతో మంది ప్రముఖులూ ఉన్నారు.*

*ఎందరో సాహిత్యాభిమానులను గురువారం ఉదయం కోసం వసుంధర పేజీ కోసం ఎదురు చూసేలా ఆసక్తి కలిగించిన శ్రీధర (మల్లిక) కథలు, కౌముది పాఠకుల కోసం ముఖ్యంగా నవతరం కోసం... ప్రతి నెలా.. చదవండి.!!*

# అన్వేషణ

సాయంత్రం అవుతోంది.

విమల ఇంటికి వచ్చింది. అపార్ట్ మెంట్ తాళం తీసి లోపలికి వెళ్ళి బోల్ట్ బిగించింది. ఇంక బాహ్య ప్రపంచంతో సంబంధం లేదు. నాలుగు గోడల మధ్యా అనంతాకాశమంత ఏకాంతం.

ఒంటరితనం శాపం అని అంటారు. కానీ శాపం అనుకున్నదే ఒక్కోసారి వరం అవుతుంది. ఆమెకు తల్లి ఉన్నది. తండ్రి ఉన్నాడు. భర్త ఉన్నాడు. స్నేహితులున్నారు. వీళ్ళందర్నీ ఇచ్చి కూడా ఆమెకు ఏమాత్రం మనశ్శాంతి ఇవ్వని భగవంతుడు ఉన్నాడు.

వీళ్ళందరికీ దూరంగా ఉంటోంది. ఎందువల్ల అంటే ఆమెకు ఎవరి గుణగణాలూ నచ్చటం లేదు. ఎవరిని తల్చుకున్నా చికాకు, కోపం.

కన్నీటి వానలో తడుస్తూ, కత్తి అంచు మీద నడుస్తూ, ఈ అశాశ్వతమైన జీవితమే శాశ్వతం అనిపించే ప్రేమ కోసం పరితపిస్తూ....ప్రతిఫలాపేక్ష లేని ఆపేక్ష కనబరిచే వ్యక్తి కోసం తపిస్తూ, పదేపదే జపిస్తూ, బ్రతుకు భారాన్ని మోస్తోంది.

తల్లి అనగానే జన్మనిచ్చిన దేవత గనుక ఆమెను గొప్పగా ఊహించు కోవటం సహజం. నిజంగానే ప్రతి స్త్రీ తన పిల్లల ఉన్నతిని కోరు కుంటుంది. అయితే ప్రతి రూలుకూ ఒక మినహాయింపు ఉంటుంది. ఆ మినహాయింపు కిందకు వస్తుంది ఆమె తల్లి. బాగా అలిసిపోయినప్పుడు తల్లి దగ్గరికి వెళ్ళాలని అనిపిస్తుంది. కానీ పెళ్ళి అయిన ఆడపిల్ల బాధ్యత తమది కాదని ఆమె అభిప్రాయం. తను పుట్టింటికి వెళ్ళగానే "ఎందుకొచ్చావే ?" అని అడుగుతుంది. 'నువ్వు ఇక్కడికి రావలసిన అవసరం లేదు' అన్న అభిప్రాయం అందులో ఉంది. ఆమెకు ఇప్పుడు ఉన్న జబ్బుల గురించి, రాబోయే జబ్బుల గురించి ఏకరువు పెడుతుంది. "చీకటి పడుతోంది, త్వరగా వెళ్ళు" అనో "వర్షం వచ్చేటట్లు ఉంది. ఆటోలో వెళ్ళు" అని సలహా ఇస్తుంది. "ఈ పూట ఇక్కడ ఉండు" అన్న మాట ఆమె నోట రాదు. ఎందుకు అక్కడికి వెళ్ళానా అన్న బాధ మిగులు తుంది. రోజులు గడిచే కొద్దీ రాకపోకలు ఆగి పొయినయి. అసలు అమ్మ ఒకతె ఉన్నదన్న అలోచనే లేకుండా పోయింది.

విమల నిండా రెండు పదుల వయసు నిండే టప్పటికి ఉద్యోగంలో చేరింది. కొన్నేళ్ళ పాటు తెచ్చిన జీతం డబ్బులు తండ్రికి ఇచ్చేది. అప్పుడు ఆయన ముహం వికసించేది. "నా బంగారు తల్లి, ఇది పుట్టినప్పటి నుంచీ నాకు కలిసొచ్చింది" అనే వాడు. ఆయనకు కలిసి వచ్చింది కాబట్టి తనను ప్రేమగా చూస్తున్నాడన్న మాట. కూతురు పుట్టగానే కష్టాలు వస్తే తనను అడవిలో క్రూర మ్రుగాలకు అహారంగా వేసేవాడేమో. తను సంపాదన పరురాలు అయిన తరువాత బంధువులు సంబంధాలు కలుపు కోవటానికి వచ్చేవారు. "మా అమాయికి ఇప్పట్లో పెళ్ళి చేసే ఉద్దేశ్యం లేదు" అని ఆయన అందరితో చెప్పేవాడు. కూతురు సంపాదనతో ఆయన అప్పులన్నీ తీర్చుకున్నాడు. ఇప్పుడు విచ్చలవిడిగా డబ్బు ఖర్చు చేయటానికి అలవాటు పడ్డాడు. కూతురు పెళ్ళి అయితే, ఆమె సంపాదన ఆయనకు అందదు. ఇప్పుడున్న డబ్బు వెసలుబాటు ఉండదు. అదీ అసలు కారణం. ఎవరికి ఇష్టం ఉన్నా లేకున్నా జరగవలసినవి కొన్ని జరిగి పోతుంటాయి.

విమల పెళ్ళి చేసుకుంది. కూతురు పెళ్ళి చేసి అనందంగా అత్తారింటికి పంపవలసిన బాధ్యత వాళ్ళకు ఉంది. ఆ విషయమే మరిచి పోయారు. తెగించి విమల పెళ్ళి చేసుకుంటే "మేము చచ్చామనుకున్నావా ?" అంటూ ఈసడించు కున్నారు. తల్లి తండ్రులు బద్ధ శత్రువులు అయిపోయారు.

ఆ శత్రుత్వం అలా కొనసాగినా బావుండేది. కొన్నాళ్ళ తరువాత మళ్ళీ రాకపోకలు మొదలు పెట్టారు. తండ్రి వచ్చినప్పుడు ఆర్థిక ఇబ్బందుల గురించి ఏకరువు పెట్టేవాడు. అవసరానికి డబ్బు సర్దితే లోన్ రాగానే తిరిగి ఇచ్చేస్తాననే వాడు. డబ్బు పట్టుకొని వెళ్ళేవాడు. కానీ లోన్ వచ్చినప్పుడు మాత్రం ఈ సంగతి మర్చి పోయేవాడు. అడగటానికి విమలకు నోరు పెగిలేది కాదు. పోనీలే తన తండ్రికేగా ఇచ్చింది పరాయివాళ్ళకు కాదుకదా అని సర్ది చెప్పుకునేది.

కానీ ఈ నాటకం మరీ శ్రుతిమించి రాగాన పడింది. ప్రతి నెలా ఏదో ఒక సాకుతో డబ్బు గుంజుతూనే ఉండే వాడు. నిజంగా అవసరం ఉండి తీసుకుంటే అర్థం చేసుకునేది. అవసరం ఉన్నా లేకున్నా ఏదో ఒక కారణంతో డబ్బు అడగటం తో ఆ అనుబంధం ఎంత గొప్పదో తెలిసివచ్చింది. ఏహ్య భావమూ కలిగింది.

ఇక భర్త విషయం లోనూ అమె ఆశలన్నీ అడియాస లయ్యాయి. పెళ్ళికి ముందు అందరి లాగే ఎన్నో ఊహించుకుంది. కాలు కింద పెట్టనివ్వకుండా ప్రేమగా చూసు కుంటాడనీ కోరిన కోరిక లేవీ కాదనడనీ, జీవితాంతం కొండంత అండగా ఉంటాడనీ , బ్రతుకు భారం అంతా అతని మీద మోపి నిశ్చింతగా నిద్ర పోవచ్చుననీ ఆశించింది.

మొదట్లో తనకోసమే దివి నుంచి దిగి వచ్చిన దేవుడిలా కనిపించిన వాడు క్రమంగా రంగు వెలిసిన బొమ్మలా కనిపించాడు. క్రమంగా చిరాకూ, పరాకూ ఎక్కువ అయ్యాయి. అడిగితే కోపం, అడగక పోతే మతి మరుపు. తెల్లవారక ముందే నిద్ర లేచి, ఇంటి పని ప్రారంభించి, వంట పని చేసి, ఆఫీసుకు పరుగెత్తి, అక్కడ యంత్రం లా పని చేసి, అలసి పోయి నీరసంతో ఇల్లు చేరగానే, మళ్ళీ రెండు మూడు గంటల పని... ఎన్ని గంటలు, ఎన్ని రోజులు, ఎన్ని నెలలు, ఎన్ని సంవత్సరాలు చేసినా, చేయవలసింది ఇంకా ఎంతో మిగిలే ఉంటుంది. ఎవరి కోసం ఈ అవిశ్రాంత పోరాటం ? ఎండ మావుల వెంట పరుగులు తీస్తున్నానా అన్న ప్రశ్న ఆమెను వేధిస్తోంది.

అయిన వాళ్ళందరినీ వదిలేసి, అన్ని నీవనుచు అంతరంగమున ఎంచి ఆయన్ను నమ్ముకోని వస్తే, అతని కోపతాపాలు, చీత్కారాలు మాత్రమే మిగిలాయి. అతను తిట్టినప్పుడు నోరు మూసుకొని భరించాలన్నది అతని రూలు. ఎవరైనా స్నేహితులు వస్తే వాళ్ళ ముందు తన గొప్ప చూపించు కోవటానికి భార్యని తూలనాడే వాడు. ఏమిటి అతని గొప్ప ? తనూ చదువుకుంది. సంపాదిస్తున్నది. పని మనిషి కన్నా ఎక్కువగా చాకిరీ చేస్తున్నది.

అన్నిటిలో అతని కన్నా ఎక్కువ అయినా తనని గౌరవించక పోయినా అందరి ముందూ అవమానించటం ఏమిటి? తను నోరు తెరిస్తే, వీడి పరువు ఏమవుంది? భార్యా భర్తలన్నాక ఒకరినొకరు గౌరవించుకోవాలి ... ఆ మాత్రం తెలియని వాడితో ఎంత కాలం ఇలా తనలో తనే క్రుంగి పోతూ బ్రతకటం?

ప్రేమానురాగాలతో కలకాలం బ్రతకాల్సిన మనుషుల మధ్య "నేను ఎక్కువ, నువ్వు తక్కువ" .అన్న భావం రాకూడదు. సుపీరియారిటీ కాంప్లెక్స్ అనేది కంప్యూటర్ వైరస్ లాంటిది. మొత్తం సిస్ట మ్ నే, కుటుంబ వ్యవస్థనే ధ్వంసం చేస్తుంది.

ఓపిక పట్టినంత కాలం ఓపిక పట్టింది. సహనం నశించాక, నువ్వు ఎవడివిరా నన్ను అనటానికి ... అని నిలదీసింది.

ఆమెకు తల్లీ తండ్రీ ఉన్నారు. భర్త ఉన్నాడు. నిజానికి వీళ్ళందరితో విడదీయరాని అనుబంధం ఉండాలి.. కానీ అనుబంధాలన్నీ వ్యాపార సంబంధాలే అవుతున్నందు వల్ల, అయిన వాళ్ళ మధ్య కూడా దూరం పెరిగి పోతున్నది.

ఆమె ఇప్పటికీ ఎదురు చూస్తూనే ఉంది. ప్రతిఫలాపేక్ష లేని ఆపేక్ష చూపించే వ్యక్తి కోసం అన్వేషిస్తూనే ఉంది. ఆ అన్వేషణ ఈ జన్మకు పూర్తి అవుతుందా ?

(వచ్చేనెల మరో కథ)

Click here to share your comments on this story.